కథానిక

# పరిణామ స్వరూపం

ఎస్. యం. సుభాని

ఎంతో కాలానికి క్రొత్తగా వచ్చిన డాక్టరు గారింట్లో పని దొరికింది వెంకటాంకు. అంతక్రితం తాసిల్దారుగారింట్లో పనిచేస్తుండేది. వారు వెళ్ళిపోయి నాలుగైదు నెలలైంది. ఇన్నాళ్ళకు మళ్ళా పనిదొరికింది. డాక్టరుగారిభార్య పార్వతమ్మకు, ముక్కూమొగం తెలియని కొత్త మనిషిని పనిచేసేందుకు పెట్టుకోవటమంటే మొదట కొంచెం సంకోచం కలిగింది. కాని వెంకటాం తన పనిపాటలవల్ల, అణకువవల్ల, ఆమె సంకోచాన్ని పోగొట్టి, ఈ నెలనాళ్ళలోనే పార్వతమ్మ నమ్మకాన్ని సంపాదించ కలిగింది.

నెలజీతం పదిహేను రూపాయలు చేతిలో పడంగానే వెంకటాం భాగ్యం అబ్బినట్లు సంతోషించింది. పండగ ఇంకా నాలుగురోజులే ఉన్నది కాబట్టి పిల్లలకు చొక్కాలు కుట్టించాలనుకున్నది. పోయిన నాలుగైదు నెలలు పనిలేక వెంకటాం ఎన్ని అగచాట్లు పడిందో ఎవరికీ తెలియదు. భర్త కోటిగాడు ఉన్నాడన్నమాటేగాని, ఎందుకూ పనికిరాడు. మంచి చెడు ఏదైనా వస్తే ఆర్చేదీ లేదు, తీర్చేదీ లేదు. వెంకటామే ఎలాగో నానా తంటాలుపడి కాసిని నూకలు సంపాదించి గంజి కాచి, కాస్తపిల్లలకుపోసి కాస్త వాడి ఎదాన పడేసేది. ఎలాగో అష్టకష్టాలుపడి నెట్టుకొచ్చేది. ఈనాటికి డాక్టరుగారింట్లో పనిదొరకంగానే కష్టాలన్నితొలగినట్లనిపించింది.

గుడిసెలో అడుగు పెట్టూనే కోడిగాడినిచూసి గతుక్కుమన్నది వెంకటాం. చివరిదమ్ములాగి బీడీముక్క విసిరిపారేస్తూ వెంకటాంని సమీపించాడు కోటిగాడు.

"ఏదుండావె ఈయేల్దాక? నీకోసం యెదురు సూత్తు కళ్లుపోయినై గందంటే!" అన్నాడు.

వెంకటాంకు తెలుసు కోటిగాడి ఎత్తులు. డబ్బు కావలసివస్తే మెత్తగా మాటలు మొదలుపెట్టాడు. వాడడిగినప్పుడు, డబ్బుండియిస్తే సరేసరి, లేకపోతే మెత్తనిమాటలు విడచి మొత్తేందుకు తయారవుతాడు. వెంకటాందగ్గర డబ్బులెప్పుడుంటాయొ ఎప్పుడుండవో వాడికిబాగా తెలుసు. తుక్కు పట్టినట్లు పసికట్టాడు.

"నీ యేసాలిక సాలించు. దమ్డీయిచ్చేదిలేదు. పిల్లోళ్ళకొంటిమీద గుడ్డన్నా లేదు, పండగొత్తుంది. నీ ఎదాన పడి ఉసూరుమంటుండాకు" అన్నది వెంకటాం.

కోటిగాడు మాటలువిని ఊరుకునే రకంకాదని వెంకటాంకు తెలుసు ఐనా, ఏదో చెప్పినమాట విని ఊరుకుంటాడేమోననే పిచ్చి ఆశ ఎప్పుడూ పీడిస్తూనే ఉంటుంది.

"అదికాదే, పేణంమీదికొచ్చిందే. నేకపోలే నాకెందుకే? నీయెంత కట్టపడ్తుండావో నాకు తెలీదంటే! ఒక్కరూక ఈయె, సాలు."

ఒక్కక్షణం నిదానించి కోటిగాడిని చూసింది వెంకటాం. ఎలాగూ వాడిపీడ వదలదని, బొడ్లో ఉన్న సంచిలోనుంచి ఒకరూపాయి తీసిచ్చింది. సంచిలో పరపరలాడిన కాగితాలకేసి ఆశగా చూస్తూ ఒకటి రెండుసార్లు చప్పరించి గుటక వేశాడు కోటిగాడు.

"చాలుంది గ్రదంటె! ఇంకొక్కటీయె." అన్నాడు, ఆ రూపాయి జాగ్రత్తగా పంచెకొంగున కట్టి మొల్లో దోపుకుంటూ.

వెంకటాం ఏం మాట్లాడకుండా సంచి భద్రపరచుకొని బయటికెళ్ళిపోయింది. సుబ్బిశెట్టి అంగడినుండి కావాల్సిన సరుకులు కాసిని తెచ్చి అన్నం ఉడకేసింది. కాసింతకారం కొట్టి పిల్లలకన్నంపెట్టిపంపింది. కోటిగాడు తీసుకెళ్ళిన రూపాయితో ఎక్కడో కూచుని చీట్లాడుతుంటాడు, ఇప్పట్లో రాడనుకున్నది. బయటున్న పొంత కుండలోని నీళ్ళతో కాళ్లు చేతులు కడుక్కొచ్చి నాలుగు మెతుకులు నోటేసుకుందామని పోతుంటే, ఇంతలో కోటిగాడొచ్చాడు. అన్నం తింటాడను

కుని వాడి మల్ల కడిగి తెచ్చిపెట్టింది. అన్నం వడ్డించబోతుంటే—

"ఇంకో నాలుగు రూకలీయె, అర్జంటొచ్చింది." అన్నాడు కొంచెం కరకుగా.

వెంకటాం అన్నంకుండ మూతపెట్టి, చెయ్యి కడుక్కున్నది. మల్ల మూలనున్న చట్టిపైన బోర్లకొట్టి లేచింది బయటికెళ్ళేందుకు.

"చెప్పేది నీక్కాదంటె ... ఇమ్మంటుంటేను—" అన్నాడు దోవకడ్డం నిలబడ్తూ.

"నాదగ్గర్లేదు." అన్నది వెంకటాం ముఖం ప్రక్కకు తిప్పి.

"నేనుగదంటె. అవుతాదేవ్ ...తీసీయె, మళ్ళా తెచ్చిత్తాన్లేయె నీ ఎదవడబ్బు."

"నువ్వుసచ్చి గీపెట్టేది దమ్మిడీకాను.. తాగేందుకు గంజిగ్గతిలేదు, నీ చీట్లాటకు డబ్బుకావాలి. ఏడ తెమ్మంటావు."

"యొంటేయ్ నాకు కోపమొచ్చిందంటేనా సెప్తుండా, మంసిగా ఈయంటె యినవు. బొమికలిరుగుతయ్యేవ్ ..."

"కొట్టు—సంపు. ఏదవన్నా సెయ్. దమ్మిడీకాను."

కోటిగాడు మూలనున్న కర్రతీశాడు—"ఈవంటె సెప్పు, ఇస్తావా యీవా?" అని గదుముతూ అడిగాడు. వెంకటాం తల అడ్డంగా ఊపుతూ బైటికెళబోయింది. కోటిగాడు పళ్ళుకొరుకుతూ కర్రెత్తి ఒక్క ఏటు వేశాడు. వెంకటాం "అమ్మా"అంటూ గావుకేక పెట్టి పడిపోయింది.

మళ్ళాస్పృహవచ్చి చూసేటప్పటికి వెంకటాం డాక్టరుగారింటి దగ్గరున్నది. బొడ్డుదగ్గర తడుముకున్నది. సంచిలేదు. అలాగే కళ్లుమూసుకొని పడుకున్నది.

"ఓడె కొంట్టింది, కోటిగాడేనా? సెప్పె,ఆడి బరంతం పట్తాను." అంటూ అడుగుతున్నాడు వెంకటాం తమ్ముడు చినకోటిగాడు,

వెంకటాం కళ్ళుతెరచి చూసింది, తలకు కట్టున్నది. కదలటానికి వీల్లేకుండా బాధగాఉన్నది. అలాగే వెంకటాం అక్కడనిల్చొని ఉన్నవాళ్ళను చూసింది. ఒకప్రక్క డాక్టరుగారు పార్వతమ్మ నిలబడి ఉన్నారు. రెండోప్రక్క కొంచెం ఎడంగా చినకోటిగాడు నిలబడి ఉన్నాడు.

వెంకటాం కాస్సేపు కోటిగాడిని నిదానించి చూసింది. "ఎవడో దొంగరా...నల్లగా పొడుగ్గా గడ్డంఉంది..." అన్నది కొంచెం బాధగా.

మెదలకుండా పడుకోమని చెప్తూ డాక్టరుగారు, పార్వతమ్మ బయలుదేరారు. చినకోటిగాడు కూడా వాళ్ళవెనక ఎళ్తూ—"ఇదేందో సరిగసెప్తంలేదయగోరు, తమరేనా కొంచం విచారిచ్చి తెల్సుకోండయ" అని చెప్పివెళ్ళిపోయాడు.

"ఇందాక వచ్చిన ఆడవాళ్ళుకూడా అదేమాట చెప్తున్నారు. దాని మొగుడు కోటిగాడే కొట్టంటాడు. అప్పుడప్పుడు ఇలాగే బాదుతుంటాడట. పోలీసులకు కబురంపి పట్టించండి వెధవని .." అన్నది పార్వతమ్మ.

డాక్టరుగారు ఏమీ మాట్లాడలేదు. కాస్సేపాగి వెంకటాందగ్గరి కొచ్చారు. కళ్ళుతెరిచి డాక్టరుగారివైపు చూసింది. కళ్ళవెంట నీళ్ళుకారి, ప్రక్కకను కొలకుల్లోంచి జారుతున్నై!

"ఎందు కేడుస్తావు వెంకటాం...పర్వాలేదు. నయమైపోతుందిలే." అన్నారు డాక్టరుగారు.

"ప్రాణం పోయినా బాగుణ్ణు. నయమవదని కాదు బాబు-" అన్నది వెంకటాం దుఃఖిస్తూ.

డాక్టరుగారు అలాగే చూస్తు నిల్చున్నారు.

"బాబుగారూ!" అన్నది వెంకటాం గద్గదికంగా.

"ఏమిటి?" అడిగారు డాక్టరుగారు.

"పోలీసులకు కబురంపించారా బాబు."

"నీవు చెప్పు, పంపించమంటావా?" నవ్వుతూ అడిగారు డాక్టరుగారు.

వెంకటాం ఏమీ మాట్లాడలేదు. కళ్ళనీళ్ళు కణతల ప్రక్కగా జారుతూంది.

"కబురు పంపనులే వెంకటాం, నిశ్చింతంగా పడుకో, నీవు బ్రతికున్నంత వరకు వాడికి దిగులుండదు." అని నిట్టూర్పు ఆపుకుంటూ వెళ్ళారు డాక్టరుగారు.

వెంకటాం కన్నీళ్ళు తుడుచుకొన్నది.

మర్నాడు, తగిన హెచ్చరికచేసి డాక్టరుగారు వెంకటాంను పంపించేశారు...కోటిగాడు ఇపులేదు. వాణ్ణి పోలీసులు పట్టుకెళ్తారేమోనని దిగులు పట్టుకున్నది వెంకటాంకు...వాడెంత మంచివాడో వెంకటాంకు తెలుసు. చీట్లాడే దుర్గుణం ఒక్కటున్నదా అదే కట్టుకుని పీడిస్తున్నది. ఇక వాడికా దుర్బుద్ధిచచ్చేంతవరకు వదలదనుకొన్నది వెంకటాం.

పొద్దు గుంకినాక పెందలకడే కునుకుపట్టింది. మళ్ళా నిద్ర రాలేదు వెంకటాంకు. రెండు జాముల రాత్రి గడిచింది. అలాగే కళ్ళు మూసుకొని పడి ఉన్నది. ఇంతలో వాకిలికున్న తడిక కదలించిన చప్పుడయింది. అదలించే ఓపిక కూడా లేదు. ఇంతలో తడిక లోపలికి నెట్టుకొని కోటిగాడు గుడిసెలో కొచ్చాడు. వెంకటాం కళ్ళు తెరచి చూసింది. మసక వెలుతుర్లో గుడిసెచుట్టూ కలయ చూస్తున్న కోటిగాడిని గుర్తుపట్టింది. పొయ్యి దగ్గర కెళ్ళి కుండలు తడుముతున్నాడు. అది వాడి అలవాటు. వాడాకలిగా ఉన్నాడనే విషయం గమనించిన వెంకటాం మనసులో బాధపడింది. పొయ్యిదగ్గర్నుంచి లేచి దీపానికి సమీపంలో చాపపైన పడుకొని నిద్రిస్తున్న పిల్లలవైపుచూశాడు కోటిగాడు. మళ్ళా వెంకటాం పడుకున్నవైపు చూసి మంచాన్ని సమీపించాడు. తలకు కట్టుతో పడుకొనివున్న వెంకటాంని చూస్తు మంచంపక్క చితకలపడ్డాడు.

"ఎంకటాం" అని పిల్చాడు మెల్లగా, వెంకటాం ముఖంలో ముఖంపెట్టి చూస్తూ.

"ఊఁ..." అన్నది వెంకటాం నీరసంగా.

"దెబ్బ బాగా తగిలిందేంటే?" అని అడిగాడు, పిరికిగా కట్టుతో కప్పబడిఉన్న చెంపల్ని తాకుతూ.

"అబ్బే, ప్రేణం పోందే" అంది వెంకటాం.

"ఛా నాయాల్ది... అదేంమాట, మరిగానా, నువు డబ్బిస్తే ఇంతెందుకవుద్ది?"

"అందుకె తీస్కెళ్తివిగా సంచి, ఈ నెల రోజులు."

వెంకటాం మాట పూర్తిచేయకముందే "ఓర్లె సెప్పింది, పిల్సుగ్రాయె ... రగతం సూసి బెదిరి పరిగెత్తిని గదంటే" అన్నాడు కోటిగాడు.

"ఏందేంది?" అంటూ లేవబోయింది వెంకటాం. కానిడూపులో గాయం బాధపెట్టింది. "అబ్బా" అంటూ మూల్గింది.

"లేమాకె, పండుకోయె...సత్తెప్పెమానంగానే తీనేదె ఎంకటాం"అన్నాడు కోటిగాడు.

వెంకటాం మళ్ళా లేవబోతుంటె, కోటిగాడు మెడక్రింద చెయివేసి లేపి కూర్చోబెట్టాడు. అలాగె వాడు వెంకటాం కాళ్ళదగ్గం కూర్చొని దాని మోకాళ్ళమీద కుడిచెయ్యివేసి, వెంకటాం ముఖం చూస్తూ కూర్చున్నాడు. వెంకటాం, దీపానికి సమీపంలో చాపమీద నిద్రిస్తున్న పిల్లవైపుచూస్తూ కూర్చున్నది. గుడిసెలో ఆముదం దీపపు వెల్తురు మందంగా ప్రసరిస్తున్నది.

"మరి సంచికేటయిందే?"అనడిగాడు కోటిగాడు.

"ఏమవుద్ది, నీ మానాన నువు పోయేవు. నే తెలివితప్పి బూమ్మీద పడుంటినాయె. వచ్చినోళ్ళలోనె కాజేసుంటారు..."

"ఈకవోతె మక్కెలిరగదన్తా. ఓరొచ్చిన్రో సెప్పరె."

"చాల్లే ఇకూరుకో, పోలీసోళ్ళకు తెల్సుద్దని నే సెప్పనెలే నీపేరు. గోలసేస్తివా, ఇపుడనుభవించేది సాలక ఇంకా తెచ్చుకోవాలి."

కోటిగాడు వెంకటాంకు ఎదురుగా, కాళ్ళకు దగ్గరగా జరిగాడు. రెండుచేతులు దాని తొడల మీదవేసి, తలెత్తి వెంకటాం ముఖంలోకిచూస్తూ—

"మరెట్టాగె, రూకలన్నీ పోయినై?"అన్నాడు.

"మరేంచేస్తా...నువు బాగుంటె ఇదెందుకవుద్ది. పిల్లలకు గుడ్డముక్కలు కొందామనుకొంటె...మన కదుర్షం లేదు"అన్నది వెంకటాం పిల్లలవైపు చూస్తూ.

ఒకక్షణం ఆగి- "ఎంకటాం!" అని పిల్చాడు కోటిగాడు.

ఏమిటన్నట్లు వాడివైపు చూసింది వెంకటాం.

"మరికెప్పుడూ సేయనె ఎంకటాం"అన్నాడు.

వెంకటాంజాలిగా,నీరసంగా మందహాసంచేసింది.

"కాదె సత్తెంగా మరికెప్పుడూ చీట్లాడనె... బుడ్డోడిమీద ఒట్టే, మరికెప్పుడు సెయిసేసుకోనె ఎంకటాం" అన్నాడు.

బుడ్డోడంటే కోటిగాడికెంతో ప్రాణం. కోటిగాడిక మాటతప్పడని నిశ్చయించుకొన్నది వెంకటాం. మెల్లగా తనచెయ్యి వాడితలపైవేసి,సంస్కారం లేనివాడి తలవెంట్రుకలలో వేళ్లుపోనిచ్చింది.

"నాగ్గూడా పనేదేనా యిప్పిచ్చమని బాబుగోరితో సెప్పే ఎంకటాం" అన్నాడు కోటిగాడు, తల వెంకటాం ఒళ్ళో వాలుస్తూ.

ఆముదపుదీపము మసకవెలుతురులో, కోటిగాడి తలనిమురుతున్న వెంకటాం ముఖం తెల్లనికట్టు మధ్య నల్లగా నిగనిగలాడుతూ సంతోషంతో కలకలలాడింది.

★